

శరణమయ్యా.. బ్రహ్మయ్యా

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా జనం తరలిరావడంతో మఠం ఆవరణంతా కిటకిటలాడింది. -10లో



విత్తన శుద్ధితో వేరుశనగ సంరక్షణ

చిరు జల్లులు రైతుల్లో ఆశలు నింపుతున్నాయి. ఈ నేపథ్యంలో వేరుశనగ పంట సాగు చేసే రైతులు కొన్ని మెలకువలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. -10లో

గరిష్టం/కనిష్టం
33.8 /27.6

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 27.6 – 33.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్‌: కడప రామాంజనేయపురంలోని ఆంధ్రప్రదేశ్‌ మైనారిటీ గురుకుల పాఠశాలలో 5,6,7,8 తరగతులలో మిగిలిన సీట్లలో ప్రవేశానికి ముస్లిం మైనారిటీ, దూదేకుల విద్యార్థులు నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తులు ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ పెతకంశెట్టి సోమ సత్యశేఖర్‌ తెలిపారు. వివరాలకు 77801 79446, 9059500173 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్‌ తెలిపారు.

ఐటీఐలో అడ్మిషన్లకు నోటిఫికేషన్‌ విడుదల

కడప ఎడ్యుకేషన్‌: కడప ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌ చేయడానికి జూన్‌ 10వ తేదీ వరకు గడువు ఉందని ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రత్నరాజు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు https://iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్‌ చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో చేరడానికి ఎలాంటి ఫీజులు, డొనేషన్స్‌ కట్టవలసిన అవసరం లేదని తెలిపారు. డీఎల్‌టీసీ ఐటీఐలో ఎలక్ట్రీషియన్‌, ఫిట్టర్‌, మిషనిస్టు, మోటార్‌ మెకానిక్‌, టర్నర్‌, డీజిల్‌ మెకానిక్‌, వెల్డర్‌, కార్పెంటర్‌ ట్రేడ్‌లలో సీట్లు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు తమ అన్ని సర్టిఫికెట్లు, ఒక ఫొటో, ఆధార్‌, తల్లి, తండ్రి ఆధార్‌కార్డు తీసుకుని నేరుగా కడప ఐటీఐ సర్కిల్‌లోని ప్రభుత్వ డీయల్‌టీసీ ఐటీఐ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 8555958200, 9948827811 నెంబర్లను సంప్రదించాలని డిఎల్‌టీసీ ఐటీఐ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రత్నరాజు తెలిపారు.

ఏపీ ఈఏపీసెట్‌ పరిశీలన



ఏపీ ఈఏపీసెట్‌ను పరిశీలిస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్‌

వైవీయూ: ఆంధ్రప్రదేశ్‌ ఇంజనీరింగ్‌ అగ్రికల్చర్‌ అండ్‌ ఫార్మసీ కామన్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌ (ఏపీ ఈఏపీ సెట్‌)–2024 జరుగుతున్న పరీక్షా కేంద్రాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్‌ చాన్స్‌లర్‌ ఆచార్య చింతా సుధాకర్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఆయన కడపలోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ సైన్స్‌, కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్‌ కళాశాలలోని పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న కంప్యూటర్‌ బేస్డ్‌ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యాలు, పరీక్షలకు సంబంధించి సాంకేతిక పరమైన అంశాల గురించి నిర్వాహకులతో మాట్లాడారు.

రేపు క్రికెట్‌ జట్ల ఎంపిక

కేవీపల్లి: వచ్చే నెల గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టీ–20 క్రికెట్‌ పోటీకు ఆదివారం జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు ఏపీ టీ20 క్రికెట్‌ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి అద్వైత్‌ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో అండర్‌ 16, అండర్‌ 19, సీనియర్స్‌ విభాగంలో జిల్లా జట్లను ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 97015 15415, 8309365583 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రక్తపోటు నియంత్రణతో మెరుగైన ఆరోగ్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ నాగరాజు

కడప రూరల్‌: రక్తపోటు నియంత్రణతో జీవన ప్రమాణాలను పెంపొందించుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్‌ నాగరాజు తెలిపారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది 'రక్తపోటును ఖచ్చితంగా నిర్ధారించడం, దానిని అదుపులో ఉంచుకోవడం, తద్వారా జీవన ప్రమాణాన్ని పెంచుకోవడం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలో దాదాపుగా 30 శాతం మంది ప్రజలు రక్తపోటుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారని అన్నారు. అధిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం తదితర కారణాలు రక్తపోటుకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు.30 ఏళ్లు దాటిన వారు కనీసం నెలకు ఒకసారి రక్తపోటును పరీక్షించుకోవడం మంచిదన్నారు. ఒకవేళ వ్యాధి నిర్ధారణ అయితే వైద్యుల సూచనల ప్రకారం మందులను వాడి జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్‌ ఉమామహేశ్వరకుమార్‌, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ రమేష్‌, జిల్లా కంటి వెలుగు కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ సునీత, జిల్లా మలేరియా అధికారి మనోరమ, భారతి, రమణమ్మ పాల్గొన్నారు.

వన్యప్రాణులకు అమృత ధారలు!

శేషాచలం (బయోస్పెయిర్‌) అడవిలో.. పెనుశిల అభయారణ్యంలో నీటి వనరులు ఒట్టిపోయి తాగేందుకు చుక్క నీరుదొరకక మూగజీవాలు అడవిని వీడి జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. కొన్ని ప్రమాదాలకు గురై మృత్యువాతపడుతున్నాయి. మరికొన్ని వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటున్నాయి. దీంతో వన్యప్రాణుల దాహార్తిని తీర్చడంతో పాటు వేటగాళ్ల బారిన పడకుండా రక్షించేందుకు అటవీశాఖ చర్యలు చేపడుతోంది.

- మండుతున్న ఎండలతో అడుగంటుతున్న నీటి వనరులు
- నీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక చర్యలు
- శేషాచలం, పెనుశిల అభయారణ్యంలో సాసర్‌ పిట్స్‌



సాసర్‌పిట్‌ వద్ద దాహార్తి తీర్చుకుంటున్న వన్యప్రాణులు

రాజంపేట: వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ సన్నద్ధమవుతోంది. శేషాచలం కేంద్ర ప్రభుత్వం తో జీవవైవిధ్య అటవీ ప్రాంతం (బయోస్పెయిర్‌)గా గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. వేసవి కాలంలో నీటి కోసం వన్యప్రాణులు అటవీ పరిసర ప్రాంతాల్లోని జననివాసాల్లోకి వచ్చేవి. ఆ సమయంలో కుక్కలబారిన, రైలు, వాహనాలు ఢీకొని మృత్యువాత పడుతున్న ఘటనలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో గత నాలుగేళ్లుగా వన్యప్రాణులు సంచరించే ప్రాంతాల్లో నీటి తొట్టెలను ఏర్పాటుచేసి వాటి దాహార్తి తీర్చేవిధంగా కృషిచేస్తున్నారు. ఈ చర్యలు విజయవంతం కావడంతో అటవీశాఖ ఈ ఏడాది కూడా వేసవి ప్రణాళికను రూపొందించారు.దాహార్తితో అలమటిస్తున్న వన్యప్రాణుల గొంతుతడిపేందుకు అన్ని చర్యలను ఉభయ జిల్లాలకు చెందిన అటవీశాఖలు చర్యలు తీసుకున్నాయి. ఆ దిశగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రకృతి బిడ్డలను అడవి దాటనీయకుండా ముందుస్తు చర్యలకు ఉపక్రమించారు. చెట్లకు సాల్ట్‌ లిక్స్‌ను ఏర్పాటుచేస్తున్నారు. వేసవికి వన్యప్రాణులు దాహార్తితో పాటు డీహైడ్రేషన్‌ కాకుండా ఉండేందుకు సాల్ట్‌ లిక్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు.

- అన్నమయ్య జిల్లాలో శేషాచలం, పెనుశిల అభయారణ్యాలు ఉన్నాయి. 3.01 మిలియన్ల హెక్టార్లలో వైల్డ్‌లైఫ్‌ విస్తరించి ఉంది.రాజంపేట నియోజకవర్గం పరిధిలోకి లంకమల అభయారణ్యం ఉంది. అయితే ఇది వైఎస్సార్‌ జిల్లాలోకి వస్తుంది. అన్నమయ్య జిల్లాలో రాజంపేట, రైల్వేకోడూరు, బాలపల్లె, సానిపాయి, చిట్వేలి, రాయచోటి, పీలేరు, మదనపల్లె రేంజ్‌లు ఉన్నాయి. ఉభయ జిల్లాలో ఉన్న అభయారణ్యాలలో వన్యప్రాణులు నీటి కోసం అలమటిస్తున్నాయి. అవి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. శేషాచలం, లంకమల అభయారణ్యం, పెనుశిల అభయారణ్యాలలో వన్యప్రాణాలు దాహార్తి తీర్చేందుకు అటవీ సమీపంలోని పల్లెల వైపు చూస్తున్నాయి.

ఏయే జంతువులు..



నీటి కోసం అడవిలో నెమలి వెతుకులాట

అటవీ ప్రాంతంలో జింకలు, దుప్పిలు, కొండగొర్రెలు, అడవి బర్రెలు, అడవిపందులు, నెమళ్లు, చిరుతలు, పెద్దపులి, హనిబాడ్జర్‌, మనుబోతు, కణుజు, రోషకుక్కలు, తోడేళ్లు, నక్కలు, ఎలుగుబంట్లు, ఇతర జంతువులు, పక్షులు నీటి కోసం జనావాసాల వైపు అడుగులు వేస్తున్నాయి. సంచరించే ప్రాంతంలో నీటి వనరులు లేనప్పుడే ఈ పరిస్థితి ఏర్పడుతోంది.

పగలు కన్నా..రాత్రుల్లోనే నీటికోసం..

అటవీ ప్రాంతంలో ఉన్న వన్య ప్రాణులు పగలుకన్నా.. రాత్రి వేళలో గ్రామాల సమీపంలోని తోటల్లోకి వచ్చి నీటి కోసం పరుగులు తీయడం కనిపిస్తోందని ప్రత్యక్షంగా చూసిన రైతులు అంటున్నారు. వీటి వల్ల తోటలకు ఎటువంటి హానీ ఉండదని, ఏనుగులతో హానీ ఉంటుందని చెబుతున్నారు. తెల్లవారుజాము వరకు మైదాన ప్రాంతంలోనే దాహార్తీ తీర్చుకొని సేదతీరుతుంటాయని అంటున్నారు.



సాసర్‌పిట్‌ను నీటితో నింపుతున్న అటవీసిబ్బంది

శేషాచలంలో సహజవనరులు

శేషాచలంలో సహజ వనరులు ఉన్నాయి. వర్షాకాలంలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికి, వేసవిలో అరకొరగా అయిన నీటి వనరులు అందుబాటులో ఉంటాయి. దట్టమైన అటవీ ప్రాంతంలోని పెద్దకోన, దొంగబండ, ఏనుగుల బావి, దొన, దిన్నెల లాంటి ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతానికి జంతువులు వెళ్లి తమ దాహార్తిని తీర్చుకుంటున్నాయి. పెనుశిల అభయారణ్యంలో కూడా సహజవనరులు ఉన్నట్లు అటవీ వర్గాలు భావిస్తున్నాయి. పది కుంటలు, ఆరుచెక్‌ డ్యాంలు ఉన్నాయి. నీటి ఎద్దడి నివారణకు ఇవి దోహదపడతాయి. వేసవిలో దట్టమైన అటవీ ప్రాంతంలో నీటి సమస్య ఉత్పన్నమవుతోంది. ఫలితంగా కొన్నిచోట్ల వన్యప్రాణులు గ్రామాలవైపు పరుగులు పెడుతున్నాయి. ఈనేపథ్యంలో ప్రమాదాల బారినపడి, ప్రాణాలు కోల్పోతున్నాయి. మదనపల్లె పరిధిలో ఆరునెలల కిందట ఐదు కృష్ణజింకలు మృతిచెందాయి. తాజాగా నందలూరులోని నాగిరెడ్డిపల్లె శివార్లలో నీటికోసం దుప్పిలు వచ్చి మృత్యువాతపడ్డాయి. దీంతో అటవీశాఖ నీటి వనరులును కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



అభయారణ్యాలు: శేషాచలం,పెనుశిల

వైల్డ్‌లైఫ్‌: 3.1 మిలియన్‌ హెక్టార్లు

అటవీ విస్తీర్ణం: 2,57,000 హెక్టార్లు

సాసర్‌పిట్స్‌: 75

రేంజ్‌లు: 8

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు



శేషాచలం, పెనుశిల అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణకు కృషిచేస్తున్నాము. నీటితొట్టెలను వన్యప్రాణులు సంచరించే ప్రదేశాల్లో ఏర్పాటుచేశాం. జిల్లా వ్యాప్తంగా సాసర్‌పిట్‌లను అందుబాటులోకి తెచ్చాం. వీలైనంతవరకు సాసర్‌పిట్‌లలో నీటిని నింపుతున్నాము. జంతువులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. –తుమాటి నాగమణీశ్వరి, జిల్లా అటవీశాఖ అధికారి (సోషల్‌ ఫారెస్టు), రాయచోటి

నెలాఖరుకల్లా విద్యాకానుక

- స్టాక్‌ పాయింట్‌లకు చేరుతున్న నోట్‌బుక్స్‌
- కడపతోపాటు పలు మండల కేంద్రాలకు చేరుతున్న కానుక వస్తువులు

కడప ఎడ్యుకేషన్‌: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఏటా అందించే విద్యాకానుక ఈ నెలాఖరుకంతా అన్ని మండల కేంద్రాలకు చేరుతా యని సమగ్రశిక్ష ఏఎల్‌ఎస్‌ కో–ఆర్డినేటర్‌ చల్లా విశ్వనాథరెడ్డి, ఏసీఎంఓ దశరథరామిరెడ్డి తెలిపారు. విద్యాకానుకలో భాగంగా శుక్రవారం కడప మండలానికి సంబంధించిన నోట్‌ బుక్స్‌ కడపలోని సీఎస్‌ఐ స్కూల్‌లోని స్టాక్‌ పాయింట్‌కు చేరాయి. కడప సీఎస్‌ఐ స్కూల్‌ స్టాక్‌ పాయింట్‌కు చేరిన విద్యాకానుకలోని నోట్‌ బుక్స్‌ను సమగ్రశిక్ష ఏఎల్‌ఎస్‌ కో – ఆర్డినేటర్‌ చల్లా విశ్వనాథ రెడ్డి, ఏసీఎంఓ దశరథరామిరెడ్డి కడప ఎంఈఓ–1 పాలెం నారాయణ, ఎంఈఓ–2 ఇర్షాద్‌ అహ్మద్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెలాఖరు కంతా విద్యాకానుకలోని అన్ని వస్తువులు ఆయా మండలాల్లోని స్టాక్‌ పాయింట్లకు చేరతాయని తెలిపారు. కడప మండలంతో పాటు మైదుకూరు, దువ్వూరు మండలాలకు సంబంధించిన విద్యాకానుకలోని నోట్‌బుక్స్‌ ఆయా మండల కేంద్రాలకు వచ్చాయని తెలిపారు. సమగ్రశిక్ష సిబ్బంది బాస్కర్‌,సీఆర్‌పీలు కృష్ణతోపాటు పలువురు పాల్గొన్నారు.



కడప స్టాక్‌ పాయింట్‌కు చేరిన నోట్‌ పుస్తకాలను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష అధికారులు, ఎంఈఓలు

రారండోయ్‌.. వేడుక చూద్దాం!

వెల్లాలలో రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాజుపాళెం: రాజుపాళెం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు 19వ తేది ఆదివారం నుంచి 27వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఇందులో భాగంగా 20న కల్యాణోత్సవం, 22న హనుమంతోత్సవం, 23న గరుడోత్సవం, 25న రథోత్సవం (తిరుణాల) కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవస్థానముల చైర్మన్‌ బుక్కసముద్రం జగదీశ్వర రెడ్డి, ఈఓ బీవీ నరసయ్య తెలిపారు. 23న గురువారం రాత్రి మాధవ్‌ మ్యూజికల్స్‌ వారిచే ఆర్కెస్ట్రా ఉందన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని భక్తులే కాక ఇతర దేశాల నుంచి భక్తులు కూడా వచ్చి ఈ ఉత్సవాల్లో పాల్గొంటారని చైర్మన్‌ చెప్పారు.

25న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

25వ తేదీన శనివారం రథోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి సీనియర్‌ వృషభరాజములకు బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో గెలుపొందిన ఎద్లకు మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ, ఆరవ బహుమతులుగా రూ.1,10,000, రూ.75,000, రూ.50,000, రూ.30,000, రూ.20,000, రూ.10,000, మిగిలిన ఎద్లకు ప్రోత్సాహక బహుమతుల కింద రూ.5 వేలను అందజేస్తామన్నారు.



వెల్లాలలోని శ్రీసంజీవరాయస్వామి



ప్రత్యేక అలంకరణలో శ్రీచెన్నకేశవ స్వామి

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి



ఈ నెల 19 నుంచి 29వ తేదీ వరకు వెల్లాల పుణ్య క్షేత్రంలో బ్రహోత్సవాలు జరగనున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలి. బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాం.


-బి. జగదీశ్వర రెడ్డి, దేవస్థానాల చైర్మన్‌

విత్తన ఎంపిక కీలకం



ఇలా మొలకెత్తాలి

- నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి
- దిగుబడితోపాటు చీడపీడలు దూరం
- పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లులు భద్రం
- విత్తనాలు కొనుగోలులో అప్రమత్తత అవసరం



విత్తనవద్ద బస్తాలు

కడప అగ్రికల్చర్‌: పంటలసాగులో అత్యంత కీలకం విత్తన ఎంపికే. ఇది పంటల దశ, దిశ మార్చుతుంది. దీంతోపాటు మంచి విత్తన ఎంపిక జరిగితేనే చీడపీడల తోపాటు అధిక దిగుబడులు వచ్చే అవకాశం కూడా ఉంటుంది. కనుక రైతన్నలు విత్తన ఎంపిక, కొనుగోలులో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకుని తగిన మెలకువలను పాటించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మరో 14 రోజుల్లో ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభం కానుంది. ఇటీవలే జిల్లా వ్యాప్తంగా వర్షాలు కూడా కురిశాయి. ప్రస్తుతం కూడా అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చాలా మంది రైతులు వేసవి దుక్కులు కూడా చేసుకుంటున్నారు. అలాగే ప్రభుత్వం కూడా పచ్చిరొట్ట విత్తనాలను కూడా సబ్సిడీతో మంజూరు చేసింది. దీంతోపాటు అక్కడక్కడా నీటి వసతి ఉన్న వారు వరినారు సాగుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది రైతులు ఎక్కడ పడితే అక్కడ వరివిత్తనాలను కొనుగోలు చేస్తుంటారు. ఇలా చేసే తరుణంలో వారు షాపు యజమాని నుంచి బిల్లులు కూడా తీసుకోరు. విత్తన ఎంపికలో ఏదైనా పొరపాటు జరిగితే దిగుబడులు తగ్గి రైతన్నలు నష్టపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిణామాలను మనం పలు చోట్ల చూస్తునే ఉన్నాం. ఈ నేపథ్యంలో వరి విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, విత్తనమే దిగుబడులను నిర్ణయిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆర్‌బీకేలలో విక్రయించే సర్టిఫైడ్‌ విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

వ్యవసాయశాఖ నుంచి అనుమతి పొందిన అధీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలి.

- విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో డీలర్ల వద్ద తీసుకున్న బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలి
- బిల్లుపై విక్రయదారుడి పేరు, రాష్ట్ర అమ్మకపు పన్ను నెంబర్‌, విత్తనరకం, గడువుతేదీ, కంపెనీ పేరు, డీలర్‌ సంతకం ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.
- ఎక్కడ కూడా లూజు విత్తనాలు, గడువు దాటిన విత్తనాలను ఎలాంటి పరిస్థితుల్లో కొనుగోలు చేయకూడదు.
- విత్తనాల ప్యాకెట్ల సంచిపైన సీల్‌ ఉందా, లేదా అని ముఖ్యంగా చెక్‌ చేసుకోవాలి.
- రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు విక్రయదారులు ఇచ్చే కరపత్రాలను తీసుకుని వాటిలో పేర్కొన్న అంశాలు పూర్తిగా చదివి అవగాహన చేసుకోవాలి
- విత్తనం కొనుగోలు చేసిన వెంటనే పరీక్షించాలి. మొలకశాతం సంతృప్తిగా ఉన్న వాటిని ఎంపిక చేసుకోవాలి.
- మొలకెత్తే సమయం, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారిని సంప్రదించాలి.

మొలకశాతం పరీక్షించాలి



రైతులు ఎవరైనా బయట విత్తనాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితుల్లో లైసెన్సులు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలుకు సంబంధించిన బిల్లును కచ్చితంగా తీసుకోవాలి. అలాగే విత్తనాల మొలకశాతం చెక్‌ చేసుకోవాలి. మొలకశాతం తక్కువగా ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దు. – వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్‌, కృషి విజ్ఞాన కేంద్రం, కడప

క్రికెట్‌ ఎంపికలకు చక్కటి స్పందన

- సీనియర్స్‌, అండర్‌–23, 19, 15 మహిళల విభాగాల్లో ఎంపికలు



క్రికెట్‌ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్‌: కడప నగరంలోని వైఎస్‌ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్‌ మైదానంలో శుక్ర వారం జిల్లా స్థాయి మహిళల క్రికెట్‌ ఎంపికలు నిర్వహించారు. సీనియర్స్‌ విభాగం, అండర్‌–23, అండర్‌–19, అండర్‌–15 విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపికలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 85 మంది క్రీడాకారిణులు విచ్చేశారు. ఈ ఎంపికలను క్రికెట్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ వైఎస్‌ఆర్‌ డిస్ట్రిక్ట్‌ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్‌లో మహిళలకు చక్కటి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. క్రీడాకారిణులు బాగా సాధన చేసి జిల్లా జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం బౌలింగ్‌, బ్యాటింగ్‌ విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. త్వరలో జిల్లాజట్టుకు ఎంపికయ్యే క్రీడాకారిణుల జాబితాను ప్రకటిస్తామని సీఏవైడీ ప్రతినిధులు పేర్కొన్నారు. మహిళల క్రికెట్‌ కోఆర్డినేటర్‌ కె. విష్ణుమోహన్‌రావు, ఏసీఏ సౌత్‌జోన్‌ హెడ్‌ కోచ్‌ పి.మధుసూధన్‌రెడ్డి, సీఏవైడీ ప్రతినిధులు ఎల్‌. మునికుమార్‌రెడ్డి, శివప్రసాద్‌, కోచ్‌లు ఇలియాస్‌, అబూబకర్‌ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై ఫిర్యాదు

ప్రొద్దుటూరు క్రైం : భర్త నిత్యం తనను వేధిస్తున్నాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పెద్దబాబు, అనితలకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాదిన్నర బాలుడు ఉన్నాడు. లైన్‌మెన్‌గా పని చేసే పెద్దబాబు నిత్యం మద్యం తాగి తనను కొడుతూ వేధిస్తున్నాడని భార్య ఆవేదన వ్యక్తం చేసేది. తాజాగా మళ్లీ కొట్టడంతో ఆమె శుక్రవారం సాయంత్రం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అబ్దుల్‌నజీర్ తెలిపారు.

ఆర్టీపీపీ కార్మికుడి ఆత్మహత్య


మృతి చెందిన సుదర్శన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పట్టణంలోని శాంతి నగర్ కాలనీలో నివాసముంటున్న ఆర్టీపీపీ కాంట్రాక్ట్ కార్మికుడు వల్లెపురెడ్డి సుదర్శన్‌రెడ్డి(38) ఇంట్లోనే ఉరి వేసుకుని శుక్రవారం ఆత్యహత్య చేసుకున్నట్లు యర్రగుంట్ల హెడ్ కానిస్టేబుల్ రాఘవరెడ్డి తెలిపారు. వల్లెపురెడ్డి సుధర్శన్‌రెడ్డి ఆర్టీపీపీలోని కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నారు. మృతుడికి భార్య ఉమామహేశ్వరితోపాటు, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సుదర్శన్‌రెడ్డి జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్యహత్య చేసుకున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి...


రైలు కింద పడి మృతి చెందిన లక్ష్మీదేవి

ఎర్రగుంట్ల : రైలు కింద పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నారు. యర్రగుంట్ల–ప్రొద్దుటూరు రైల్వే మార్గంలో రైలు కింద పడి ఎలగటూరు లక్ష్మీదేవి(35) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు యర్రగుంట్ల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజారాంరెడ్డి శుక్రవారం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా బేతంచర్ల మండలానికి చెందిన ఎలగటూరు లక్ష్మీదేవికి మానసిక స్థితి సరిగా లేక గత ఆరేళ్లుగా చికిత్స చేయించు కుంటున్నారు. మృతిరాలి భర్త వెంకటేశ్వర్లు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గురువారం ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మీదేవి ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్ సమీపంలో విజయవాడ–ధర్మవరం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు.

శరణమయ్యా.. బ్రహ్మయ్యా


దీక్షబంధనాలంకారోత్సవంలో దర్శనమిస్తున్న స్వామి


మఠం ప్రాంగణంలో భక్తజనం

- వైభవంగా ఆరాధనోత్సవాలు
- పోటెత్తిన భక్తజనం
- మార్మోగిన 'బ్రహ్మ'నామస్మరణ

బ్రహ్మంగారిమఠం : 'మీ దరికి చేరామయ్యా.. మమ్మల్ని దీవించయ్యా..' 'శరణమయ్యా.. బ్రహ్మయ్యా'..అంటూ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి సమాధిని దర్శించుకుని భక్తజనం తరించారు. ఇంటింటా పండగను ఆనందంగా జరుపుకొన్నారు. క్రీ.శ.1693కు సరియగు శ్రీముఖ నామ సంవత్సరం వైశాఖ శుద్ధ దశమి నాడు సజీవ సమాధి నిష్ట పొందిన వీరబ్రహ్మేంద్రస్వామిని ఏటా కొలుస్తూ భక్తులు పర్వదినంగా జరుపుకొంటున్నారు. ఇందులో భాగంగా సజీవ సమాధి నిష్ట వహించిన ప్రాంతం బ్రహ్మంగారిమఠంలో ఆరాధన గురుపూజోత్సవాలు నాలుగు రోజుల నుంచి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా జనం తరలిరావడంతో ఆవరణంతా కిటకిటలాడింది. క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు 'జై వీరబ్రహ్మ.. జై గోవిందమాంబ' నామస్మరణ చేశారు.

కమనీయం.. దీక్షాబంధనాలంకారోత్సవం

తెల్లవారుజామున గర్భాలయంలో మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనా మూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకాలతో అభిషేకించారు. అనంతరం ప్రత్యేక ప్రస్తాలంకరణ చేసి స్వామి గుణగణాలను కీర్తిస్తూ సహస్ర నామార్చన చేశారు. స్వామి యోగ నిద్రలో ఉన్న అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం దీక్షబంధనాలంకారోత్సవాన్ని (స్వామి సజీవ సమాధి నిష్ట వహించిన సందర్భాన్ని దీక్షలో దర్శించే అలంకరణ) కనుల పండువగా నిర్వహించారు. వాసుదేవపురానికి చెందిన ఇరగం రెడ్డి మూలింటి నాగిరెడ్డి, వెంకటమ్మ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం వేదపారాయణం చేసి కాలజ్ఞానంలోని కొన్ని తత్వాలను ఆస్థాన పండితులు పెద పాటి నాగేశ్వరరావు వివరించారు.

వైభవం.. నందివాహనోత్సవం

రాత్రి భక్తుల కాలక్షేపం కోసం హరికథ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నందివాహన గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి నంది వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి స్వామి నివశించిన ఇంటి వరకు చేర్చి.. అనంతరం కందిమల్లయ్యపల్లె పుర వీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. ఉత్సవానికి కమలాపురం నియోజకవర్గం పెద్దపుత్తకు చెందిన తాడిగొట్ల వీరారెడ్డి, నారాయణరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా దాతలు అన్నదానాలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ విరివిగా చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం సంగీత కళాశాల విద్యార్థులు త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. వీరబ్రహ్మేంద్రస్వామిని స్థానిక ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తనయుడు ఎస్.అశోక్‌రెడ్డి, ఎంపీపీ వీరనారాయణరెడ్డితో పాటు నాయకులు దర్శించుకున్నారు పూర్వపు మఠాధిపతులు వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, గోవిందస్వా మి, వరదరాజస్వామి తదితరులు పాల్గొన్నా రు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజి, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, సిబ్బంది, స్వామి శిష్యులు ఏర్పాట్లు చేపట్టారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

నేడు బ్రహ్మ రథోత్సవం

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం సాయంత్రం బ్రహ్మ రథోత్సవం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఇందుకు తగిన ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ షాక్‌తో ఏడు గేదెలు మృతి


మృతిచెందిన గేదెలు

బి.కోడూరు : మండలంలోని టమటంవారిపల్లె గ్రామానికి చెందిన మడతల సుబ్బలక్ష్మమ్మకు చెందిన 4, ద్వారకచర్లరమాదేవికి చెందిన 2 గేదెలు, బొల్లాగు రివిరెడ్డికి చెందిన గేదె పుల్లివీడు పొలాలకు మేతకు తీసుకెళ్లారు. అక్కడ 11 కె.వి. విద్యుత్తు తీగల తగలడంతో షాక్‌కు గురై ఏడు అక్కడికక్కడే మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు బి.కోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అధికారులు తమను ఆదుకోవాలని వారు కోరారు.

పిచ్చి కుక్క వీరంగం

– ఆరుగురు చిన్నారులకు గాయాలు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఆర్ట్స్‌కాలేజి రోడ్డు, ఖాదర్‌హుస్సేన్ మసీదు వీధుల్లో పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. శుక్రవారం రాత్రి కుక్క దాడి చేయడంతో ఆరుగురు చిన్నారులకు గాయాలయ్యాయి. గాయ పడిన చిన్నారులను తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం చిన్నారులను ఇంటికి తీసుకెళ్లారు. ఒకే సారి ఆరుగురు పిల్లలపై కుక్కలు దాడి చేయడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్ట్రాంగ్ రూమ్స్ తనిఖీ

– కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు


అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం నగర శివారులోని 'మౌలానా అజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీ'లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులతో ఆయన సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా వుండాలన్నారు. అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట భద్రత కల్పించాలని కోరారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో వుంటుందన్నారు. ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నలుగురు అంతకుమించి గుంపులుగా వుండరాదని, అనుమతులు లేకుండా ఎక్కడా సభలు, ప్రచారాలు నిర్వహించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్. సుధాకర్, 'దిశ' డీఎస్పీ రమాకాంత్, డి.టి.సి డీఎస్పీ రవికుమార్, రిమ్స్ పిఎస్ సీఐ కె. రామచంద్ర, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై అగస్త్యేశ్వరుడు



సింహ వాహనంపై అగస్త్యేశ్వరస్వామి, లలితా సహస్రనామ పారాయణం

ప్రొద్దుటూరు కల్చరల్ : బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్ర వారం రాత్రి స్వామి సింహ వాహనంపై ఊరేగారు. వేకువ జామున అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. 200 మంది భక్తులకు సామూహికంగా ఐదుసార్లు లలితా సహస్రనామాన్ని లోకకల్యాణార్థం పఠించారు. రాత్రి గంగా, రాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సింహ వాహనంపై కొలువుదీర్చి శివనామస్మరణ మధ్య ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల వాహనం బోల్తా



వేముల : మండల కేంద్రమైన వేములలో శుక్రవారం గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్తున్న వాహనం డివైడర్‌ను ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. ఎలాంటి సంఘటన జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వాహనం బోల్తాపడి గ్యాస్ సిలిండర్లులీకై ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు.

టీడీపీ దుశ్చర్యలకు సహకరించవద్దు

- కడపలో హ్యాట్రిక్ సాధించబోతున్నాం
- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా



కడప కార్పొరేషన్ : పల్నాడు ప్రాంతాన్ని రావణ కాష్టం చేస్తున్న టీడీపీ నాయకులు అదే పంథా కడపలో అనుసరించాలని ప్రయత్నిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ కడప అసెంబ్లీ అభ్యర్థి ఎస్‌బి.అంజద్‌బాషా ఓ ప్రతికా ప్రకటనలో ఆరోపించారు. టీడీపీ మాయలోపడి, వారి దుశ్చర్యలకు ప్రజలు సహకరించవద్దని సూచించారు. 2014, 2019లో లేని ఘర్షణలు ఇప్పుడు వస్తున్నాయంటే టీడీపీ కుట్రేనని ప్రజలు గ్రహించాలన్నారు. కడప ఎమ్మెల్యేగా తనను గెలిపించడానికి అవిశ్రాంతంగా కష్టపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల అనంతరం పల్నాడులో టీడీపీ రౌడీలు చేసిన అరాచకం ప్రజలకు తెలుసునన్నారు. ఇపుడు ప్రశాంతమైన కడప నియోజకవర్గంలో టీడీపీ నాయకులు వైఎస్ఆర్‌సీపీ నాయకులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాదరణతో ఎమ్మెల్యేగా గెలిచానని, మూడోసారి తాను హ్యాట్రిక్ సాధించబోతున్నానని తెలిపారు.

ట్రిపుల్ ఐటీ పరిపాలనాధికారి నియామకం


పరిపాలనాధికారిగా నియామక పత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ పెనుగొండ రవికుమార్

వేంపల్లె : కడప జిల్లా జమ్మలమడుగు పట్టణానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెనుగొండ రవికుమార్‌ను ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ పరిపాలనాధికారిగా నియమిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ పెనుగొండ రవికుమార్ జపాన్ యూనివర్సిటీ ఆఫ్ అయిజు నందు పీహెచ్‌డీ పూర్తి చేసి, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పదేళ్ల నుంచి యూనివర్సిటీలో ఎంటెక్ కో ఆర్డినేటర్‌గా, ఐటీ ఇన్‌ఛార్జిగా, డిపార్ క్రమశిక్షణ కమిటీ సభ్యులు, తదితర బాధ్యతలను నిర్వహించి క్రియాశీలకంగా వ్యవహరించారు. రవికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను క్రియాశీలకంగా నిర్వహించి యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

విత్తన శుద్ధితో వేరుశనగ సంరక్షణ

- భూసార పరీక్షలు తప్పనిసరి
- లోతైన దుక్కులతో అధిక దిగుబడి

ఖరీఫ్ ముంచుకొస్తోంది. చిరు జల్లులు రైతుల్లో ఆశలు నింపుతున్నాయి. నేల కాస్త పదునైతే దుక్కులు చేసి... విత్తనం వేసేందుకు రైతన్న సిద్ధమవుతాడు. ఈ నేపథ్యంలో ప్రధానంగా వేరుశనగ పంట సాగు చేసే రైతులు కొన్ని మెలకువలు పాటించాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోతే నష్టపోవాల్సిందేనని హెచ్చరిస్తున్నారు.


వేరుశనగ పొలాల్లో లోతైన దుక్కులు చేస్తున్న రైతులు

గుర్రంకొండ : అన్నమయ్య జిల్లా పడమటి మండలాల్లో ముఖ్యమైన పంట వేరుశనగ . 50 శాతం మంది రైతులకు వేరుశనగ పంటే ఆధారం. ఖరీఫ్ సీజన్‌లో ఈ పంట సాగు చేసేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. వేరుశనగ పంట సాగుకు ముందు పొలాల్లో లోతైన దుక్కులు చేయాలని, సాగుకు నెల రోజుల ముందే పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అనంతరం విత్తన కాయల పరీక్ష తప్పనిసరి. చాలా మంది రైతులకు అవగాహన లేకపోవడంతో తగినంత పంట దిగుబడి సాధించలేక నష్టాలపాలవుతున్నారు.

లోతైన దుక్కులు

మేలో తొలకరి వర్షాలకు దుక్కులు చేసే ముందు ఎరువులను పొలాలపై చల్లుతారు. ఆ తరువాత లోతైన దుక్కులు చేపడతారు. తద్వారా పొలంపైనున్న ఎరువులు భూమిలోపల చేసి పంటసాగు ప్రారంభానికి ముందే సారవంతమైన ఎరువుగా మారుతుంది. పంట సాగు చేసే సమయం కంటే ముందు కనీసం రెండు మార్లు పొలాల్లో లోతైన దుక్కులు రైతులు చేస్తుంటారు. తద్వారా పంట సాగు చేసే పొలం ఎంతో సారవంతమవుతుందని రైతుల నమ్మకం.

విత్తన నాణ్యత

వేరుశనగ సాగు చేసే ముందు విత్తనకాయల నాణ్యతను పరీక్షిస్తే మొలకెత్తే శాతం తెలిసిపోతుంది. ఒక ట్రేలో మట్టి, ఇసుక, ఎరువులతో నింపి వంద విత్తన గింజల్ని నాటాల్సి ఉంటుంది. 12 రోజుల అనంతరం మొలకెత్తే శాతాన్ని బట్టి నాణ్యత తెలుస్తుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 80 నుంచి 90 శాతం వరకు మొలకెత్తితే నాణ్యమైనదిగా నిర్ధారించవచ్చు.

భూసార పరీక్ష

పొలాల్లో రెండేళ్ల కోమారు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. పంట సాగు చేసిన ప్రతిసారీ భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటుంది. పరీక్షల ద్వారా వాటి శాతం ఎంతమేర తగ్గిందో తెలుసుకోవచ్చు. సాగుకు ముందు పొలంలో తగినంత మేర వాటిని అందించగలిగితే పంట దిగుబడులు సాధించవచ్చు. వ్యవసాయాధికారులే మట్టిని సేకరిస్తారు.

సూక్ష్మపోషకాలు

సూక్ష్మ పోషకాల సమతుల్యత సరిచూసుకుని మందులు వినియోగించాల్సి ఉంటుంది. వేరుశనగ పంట సాగులో బోరాన్, సల్ఫర్ వినియోగిస్తే కాయలు నాణ్యతగా వస్తాయి. జింక్ వినియోగిస్తే వేరుశెనగ మొక్కల్లో కాండం, మొక్క ఎదుగుదల ఎక్కువగా, ధృడంగా ఉంటాయి. కాయల్లో గింజ ఏర్పడే శాతం పెరుగుతుంది. దుక్కులు చేసే సమయంలో 200 కిలోల జిప్సమ్ చల్లితే నూనె శాతం పెరుగుతుంది.

విత్తనశుద్ధి తప్పనిసరి

వేరుశెనగ విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. డీఎమ్–45 రకం మందును ఎకరాకు సరిపడే విత్తన గింజల్లో 180 గ్రాములు కలిపి పొలంలో విత్తాలి. తద్వారా గింజల్ని ఆవహించే తినేసే వేరుతొలుచు పురుగులు దూరంగా వెళ్లిపోతాయి. అంతేగాక విత్తనాలు మెలకెత్తే వరకు వాటికి సంరక్షణగా ఉంటాయి. అంతేగాక విత్తనాలు మెలకెత్తే వరకూ వాటిని సంరక్షిస్తాయి.

కలుపుమొక్కల నివారణ

వేరుశెనగ పంట సాగులో కలుపు మొక్కల నివారణా మందులు తప్పనిసరిగా వాడాలి. విత్తనాలు వేసిన రోజు సాయంకాలం, మరుసటి రోజున గానీ మందులు పొలంలో పిచికారీ చేయాలి. ఎకరం పొలానికి ఒకటిన్నర లీటరు పెండా మిథాలిన్ అనే మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట పొలంపై పిచికారీ చేయాలి. విత్తనాలు వేసినప్పటి నుంచి రెండు నెలల పాటు కలుపు మొక్కలు పెరగకుండా చూడవచ్చు.


అంతర పంటలు

వేరుశనగ పంట సాగులో అంతర్ పంటలు సాగు చేయడంతో పంటకు ఎంతో రక్షణగా ఉంటుంది. పొలంలో విత్తన గింజలు వేసే ఆరుసాళ్ల(వరుసలు)కు ఒకసాలు కందులు, అలసందలు వంటి విత్తనాలు వేయాల్సి ఉంటుంది. పొలం చుట్టూ రెండు నుంచి నాలుగు వరసలు జొన్నలు వేయాలి. వీటితో పక్క పొలాల నుంచి వైరస్, ఇతర క్రిమి కీటకాలు, ఎర్రగొంగళి పురుగులు ఆహించకుండా చేయవచ్చు.


ట్రేలో ప్రయోగాత్మకంగా విత్తన నమూనాలు


మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

విత్తన పరీక్షలతో ప్రయోజనం



వేరుశెనగ విత్తన పరీక్షలు చేయించుకుంటే ప్రయోజనం ఉంటుంది. విత్తనాలు మొలకెత్తే పరీక్షలు తప్పనిసరిగా చేయిస్తే ముందుగా నాణ్యత తెలుస్తుంది. మొలకెత్తే శాతం ఎక్కువగా ఉన్న విత్తన కాయలకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఏటా ప్రభుత్వం అన్ని ఆర్బీకేలకు నాణ్యమైన రాయితీ వేరుశెనగ విత్తన కాయల్ని సరఫరా చేస్తుంది. పంట సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు.

– రమణ, రైతు, గిరికుంటపల్లె

సరైన యాజమాన్యంతో అధిక దిగుబడులు



వేరుశెనగ పంట సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు, మెలకువలు పాటించి సరైన యాజమాన్యం పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. పొలంలో సేకరించిన మట్టి నమూనాల ఆధారంగా భూసార పరీక్షల్లో వచ్చిన ఫలితాలను బట్టి అధికారులిచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించాలి. ఎంత మేరకు ఎరువులు, పురుగు నివారణ మందులు వావాలో తెలుసుకోవాలి.

– ఓబుల్‌రెడ్డి, రైతు, మొరంమీదపల్లె